# ప్రజాశక్తి

బుధవారం 19 జులై 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

గుంటూరులో ధర్నాలో మాట్లాడుతున్న నేతాజి

నరసరావుపేట ధర్నాలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

# నిర్బంధాలను అధిగమించి

- గుంటూరు, పల్నాడు డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయాల వద్ద ఆశాల ధర్నా, ప్రదర్శనలు
- వెట్టిచాకిరీ నుండి విముక్తి కల్పించాలని నినాదాలు
- జాబ్‌చార్ట్‌పై రెండ్రోజుల్లో సర్క్యులర్ : గుంటూరు డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. అయినా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వందలాది మంది ఆందోళనలో పాల్గొన్నారు. తొలుత గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి డిఎం అండ్‌హెచ్‌ఒ కార్యాలయం వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఎంహెచ్‌ఒ కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని గేట్లు మూసివేశారు. దీంతో ఆశాలు గేటు ఎదుటే బైటాయించారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శ్రావణ్‌బాబు ఆశాల ఆందోళన వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి, ఇతర నాయకులు అధికారులకు సమస్యలను వివరించి, వినపత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన డిఎఅండ్‌హెచ్‌ఒ రెండ్రోజుల్లో ఆశాల జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన సర్క్యులర్ విడుదల చేస్తామని, జిల్లా స్థాయిలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో స్టేషన్ రోడ్‌లోని ధర్నాచౌక్‌లో బహిరంగ సభ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా డిఎంహెచ్‌ఒ కార్యాలయానికి వెళ్లి జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణికి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాకు వివిధ సంఘాలు మద్దతు తెలిపాయి.

గుంటూరులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ మాతాశిశు మరణాలు తగ్గించాలనే లక్ష్యంతో ఆశా వ్యవస్థ ఏర్పాటు చేశారని, కానీ 17 ఏళ్లుగా ఆశాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాలు ఇవ్వకుండా, జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని విధులు అప్పగిస్తున్నారని

▶ 2లో

కలెక్టరేట్ వద్ద రైతులు, నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# రైతు ఉద్యమంపై ఉక్కుపాదం

- గుంటూరు ఛానల్ విస్తరించాలని చేపట్టిన మహాధర్నాను అడ్డుకున్న పోలీసులు
- పలువురు నాయకులు, రైతుల అరెస్టులు
- నిర్బంధాన్ని ఖండించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కలెక్టరేట్ వద్ద 21 రోజులుగా రైతులు చేస్తున్న రిలే దీక్షల్లో భాగంగా మంగళవారం చేపట్టిన మహాధర్నాను ప్రభుత్వం అణచివేసింది. కలెక్టరేట్ వద్ద పోలీసుల్ని భారీగా మోహరించి, ధర్నాకు వచ్చిన నాయకుల్ని బలవతంగా వాహనాల్లో ఎక్కించి నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ, లావు అంకమ్మచౌదరి, తెలుగు యువత నాయకుడు ఆర్.సాయి సహా సుమారు 20 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

▶ 2లో

## ఎసిబి వలలో జిఎస్‌టి ఎఇఒ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పట్టుబడిన నాగప్రసాద్

గుంటూరులోని శుభం కళ్యాణ మండపంలో తాత్కాలిక ప్రాతిపదికన ఫర్నీచర్ విక్రయ ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి కోసం జిఎస్‌టి అధికారులు రూ.40 వేలు లంచం డిమాండ్ చేయగా అడ్వాన్సుగా రూ.15 వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వలపన్ని మంగళవారం పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం... చెన్నయ్‌కు చెందిన ప్రాంప్ట్ ట్రేడ్ ఫెయిర్స్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఇందుకు అనుమతి కోసం సంస్థ అకౌంట్స్ మేనేజర్ వి.వెంకటేషన్ సుందర్ రాజన్ జిఎస్‌టి అధికారులకు దరఖాస్తు చేశారు. స్థానిక వసుంధర కాంప్లెక్స్ జిఎస్‌టి కార్యాలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తోడేటి నాగప్రసాద్ సుందర్‌రాజన్ నుంచి రూ.40 వేలు డిమాండ్ చేశారు. దీంతో అతను ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు అడ్వాన్సుగా రూ.15 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడు నాగప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్టు ఎసిబి అదనపు ఎస్‌పి మహేష్ తెలిపారు.

# ఖరీఫ్ మందగమనం

## చాలీచాలని వానలతో ముందు సాగని సాగు - కాల్వలకు నీరు అంతంతమాత్రమే

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. సీజన ప్రారంభం అయి 40 రోజులు దాటినా ఇంత వరకు సాగు వేగం పుంజుకోలేదు. జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలనుసాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 32 వేల ఎకరాల్లోనే పంటలు వేశారు. జిల్లాలో వర్షాలు కొంత మేరకు ఆశాజనకంగా ఉన్నా సాగుకు సరిపడా కురవడం లేదు.

గుంటూరు జిల్లాలో జూన్ నెల మొత్తం 97.1 మిల్లీ మీటర్లవర్షం కురవాల్సి ఉండగా 105.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జులైలో 164.9 మిల్లీ మీటర్ల వర్షపాతం అవసరం కాగా 17వ తేదీ వరకు 141.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలోని కొన్ని మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు కాగా మరికొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు కేవలం 12500 ఎకరాల్లోనే వెదపద్ధతిలో సాగు చేశారు. డెల్టాలోఇంకా నాట్లు ప్రారంభం కాలేదు. పత్తి సాగు 77 వేల ఎకరాల్లో చేస్తారని అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 16 వేల ఎకరాల్లోనే విత్తనాలు నాటారు. కూరగాయాలు దాదాపు 6 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 400 ఎకరాల్లోనే వేశారు. పసుపు 650 ఎకరాలు, చెరకు 60 ఎకరాలు, మినుము 10 ఎకరాలు, సోయాబిన్ 300 ఎకరాలు సాగు చేశారు. అయితే తొలకరి పంటలుగా గ్రీన్ మెన్యూర్ సాగు చేస్తారని

▶ 2లో

సమావేశంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

# ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి

## జాతీయ రహదారి నిర్మాణంపై సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నకరికల్లు నామ్ రోడ్డు జంక్షన్ - నరసరావుపేట - చిలకలూరిపేట - చీరాల ఓడరేవు వరకు నిర్మించ తలపెట్టిన నాలుగు లైన్ల జాతీయ రహదారి 167-ఎ కు సంబంధించి ఆమోదిత అలైన్మెంట్ నరసరావుపేట పట్టణం నుండి వెళుతున్నందున ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని జాతీయ రహదారుల అధికారులకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. జాతీయ రహదారి నిర్మాణంపై స్టేక్ హోల్డర్స్, సంబంధిత అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్షించారు. ఆమోదిత అలైన్మెంట్, ప్రత్యామ్నాయ మార్గాలపై జాతీయ రహదారుల శాఖా అధికారులు పవర్

▶ 2లో

## ఖరీఫ్ మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నా ఇంత వరకు ఒక్క ఎకరంలో కూడా చేయలేదు. అలాగే మిర్చిసాగు ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు ఒక్క ఎకరంలో కూడా మిర్చివేయలేదు.కంది, పెసర కూడా ఇంకా ప్రారంభించలేదు. గతఏడాది ఇదే సమయానికి జిల్లాలో 65 వేల ఎకరాల్లో వివిధరకాల పంటలను సాగు చేయగా ఈ ఏడాది 32 వేల ఎకరాల్లో సాగు చేశారని అధికారుల వారంతపు నివేదికల్లో పేర్కొన్నారు. ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా తొలకరి పంటలుగా కొంత మంది రైతులు నువ్వు, పెసర, మినుము, జూట్,జనుము,గ్రీన్ మెన్యూర్ పంటలను సాగు చేస్తున్నట్టు అధికారులు ఇప్పటి వరకు చెబుతుండగా రైతులు వీటిజోలికి వెళ్లలేదు. ఎగువ ప్రాంతాల నుంచి నీటి విడుదలపై భరసా లేకపోవడం వల్ల ఈ ఏడాది సాగు ఆలస్యం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. రైతులు కూడా నీటి ఎద్దడి సమస్య పొంచి ఉండటంతో సాగుపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

శ్రీశైలంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో రావడంలేదు. శ్రీశైలం జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 33.67 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి. సాగర్‌జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 312.04 టిఎంసిలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 145.29 టిఎంసిలు ఉన్నాయి. పులిచింతల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 18.36 టిఎంసిలకు తగ్గిపోయింది. గతేడాది జులై రెండో వారం కల్లా ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల జలాశయాలకు వరద ప్రారంభం అయిందని ఈ ఏడాది ప్రస్తుతం కర్నాటకలో వర్షాలు లేక ఎగువ నుంచి జలాశయాలకు నీరు రావడంలేదని అధికారులు తెలిపారు. అయితే ప్రకాశం బ్యారేజికి ఎగువన,పులిచింతల దిగువన ఖమ్మం, ఎన్‌టిఆర్ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజికి గత కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో ఆశాజనకంగా కొనసాగుతోంది. ప్రస్తుతం 7238 క్యూసెక్కుల నీరు వస్తుండగా కృష్ణా తూర్పు డెల్టా (ఉమ్మడి కృష్ణాజిల్లా, ఏలూరుజిల్లా)కు 6,016 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా (గుంటూరు,బాపట్ల జిల్లాలు)కు 1,141క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గుంటూరు ఛానల్‌కు 81 క్యూసెక్కులు విడుదల అవుతున్నట్టు అధికారులు తెలిపారు. పశ్చిమ డెల్టాకు చాలినంతగా నీరు రాకపోవడం వల్ల రైతులు ఇంకా నారుమళ్లు పోయడం లేదని చెబుతున్నారు.

ధ్రువపత్రాలు అందిస్తున్న సురేష్‌కుమార్

## హామీలు నెరవేర్చిన ప్రభుత్వం మాదే

ప్రజాశక్తి - తాడికొండ

హామీలు నెరవెర్చిన ప్రభుత్వం తమదే అని వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం మోతడక నిడుముక్కల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చటం జరిగిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడైనా పేదల ప్రయోజనాలను పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అమలుకు సాధ్యపడని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి యేసు రత్నం, మాజీ ఎంపీపీ బి.పున్నారావు, ఎంపీటీసీ బోడపాటి సుశీల, అత్తోట అక్కయ్య, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, గుత్తా వెంకటయ్య, చాగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# నిర్బంధాలను అధిగమించి

గుంటూరులో డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నరసరావుపేటలో డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. నాణ్యత లేని సెల్‌ఫోన్లు ఇచ్చి, 14 రకాల యాప్‌లు పెట్టి సమాచారం అప్‌లోడ్ చేయాలని అంటున్నారన్నారు. వెయ్యి జనాభాకు ఒక ఆశా ఉండాలని, కానీ 1400 జనాభా నుండి 2 వేల మంది ఉన్నా ఒక్కరితోనే పని చేస్తున్నారని తెలిపారు. పనిభారంతో అనారోగ్యం బారిన పడి ఆశాలు చనిపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కోవిడ్ సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్లు అని గొప్పగా కీర్తించిన ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని పట్టించుకోవట్లేదని విమర్శిం చారు. ప్రభుత్వ విధులకు హాజరైతే టిఎ బిల్లులు ఇవ్వట్లేదన్నారు. మెటర్నిటీ లీవులు కూడా ఇవ్వట్లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మెటర్నిటీ లీవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ న్యాయమైన సమస్యలపై ధర్నా చేస్తామని రాష్ట్రస్థాయి నుండి జిల్లా స్థాయి అధికారుల వరకూ ముందుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వంలో ఎలాంటి స్పందనా లేదన్నారు. ధర్నాను విచ్ఛిన్నం చేయటానికి అధికారులు ఆశాలపై ఒత్తిడి తెచ్చారన్నారు. ఆశాల ఇళ్ల వద్దకు పోలీసుల్ని పంపించి బెదిరించే ప్రయత్నం చేసిందన్నారు. నిర్బంధాలను అధిగమించి ఆందోళనకు పెద్ద ఎత్తున వచ్చిన ఆశాలకు ఆయన అభినందనలు తెలిపారు. చాకిరి బారెడు, జీతం మూరెడు అన్న చందంగా ఆశాల ఉద్యోగం తయారైందని, కేవలం రూ.10 వేల జీతం ఇస్తూ తీవ్రమైన పనిభారం మోపుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో గతంలో ఇచ్చిన పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలన్నీ రద్దు చేశారన్నారు. ఇస్తున్న జీతంలో సచివాలయాలకు, పిహెచ్‌సిలకు వెళ్లటానికి టిఎ బిల్లులకే ఒక్కొక్కరూ రూ.3 వేలు భరించాల్సి వస్తోందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆశాలు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మి, కె.జ్యోతి, నాయకులు ఎన్.ధనలక్ష్మి, ఎన్.లక్ష్మి పాల్గొన్నారు.

నరసరావుపేటలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టని ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని, నోడల్ అధికారులు, సిహెచ్‌సి, వైద్య సిబ్బందితో బెదిరిస్తున్నారని విమర్శించారు. ప్రతినెలా 15-25 తేదీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేయకుంటే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్సీడీ సర్వే ఎఎన్‌ఎం చేయాల్సి ఉండగా ఆశాలతో చేయిస్తున్నారని, వ్యాక్సిన్ క్యారియర్లు తేవడం భారమవుతోందన్నారు. సబ్ సెంటర్ పరిధిలో ఎంల్ హెచ్‌పిల పెత్తనం మితిమీరిందని, వేధింపులు తాళలేక రొంపిచర్ల మండలం అన్నవరానికి చెందిన ఆశా వర్కర్ ఆత్మహత్యాయత్నం చేసిందని తెలిపారు. వివరాల నమోదుకు అందజేసిన ఫోను సామర్థ్యం సరిపోక సక్రమంగా పనిచేయడం లేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ 14 రకాల యాప్‌లలో పని, 26 రకాల రికార్డులు రాయాల్సి రావడం మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే సెల్‌ఫోన్లు సరిగా పని చేయకపోతే సొంతంగా కొనుకోకవాలంటున్నారని మండిపడ్డారు. రికార్డులు కూడా సొంత డబ్బులతో కొనుగోలు చేయాలని, లేకుంటే వేతనాలు నిలిపివేస్తామని ఉద్యోగం నుండి తొలగిస్తామని అధికారులు బెదిరింపులు పెరిగాయన్నారు. విలేజ్ క్లినిక్ నందు సచివాలయంలో ఉదయం తొమ్మిది గంటలు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లను శుభ్రం చేయడం, ఓపీ, ఇతర పనులనూ చేయించడతోపాటు పాటు ఉదయ సాయంత్రం రెండుసార్లు రిజిస్టర్ సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. ఆశాలకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మాచర్ల యుహెచ్‌సిలో చనిపోయిన ఆశ వర్కర్ దీనకుమారి స్థానంలో కోడలు శిరీషను కొనసాగించాలని కోరారు. ఇదిలా ఉండగా ఆందోళనకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు సిలార్ మసూద్, జిల్లా నాయకులు టి.శ్రీను, ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సంఘీభావం తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.చంద్రకళ, నాయకులు కె.బుజ్జి, ఎం.రత్నకుమారి, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమంపై ఉక్కుపాదం

ఏటుకూరు వద్ద రైతుల్ని అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసు స్టేషన్‌లో నాయకుల్ని పరామర్శించి, మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లోని గ్రామాల నుండి గుంటూరు వచ్చే అన్ని రహదారుల్లో పోలీసుల్ని మోహరించి, తనిఖీలు చేపట్టారు. గుంటూరు వస్తున్న వాహనాలు ఆపి రైతులు, నాయకులు ఉన్నారా? అని ఆరా తీశారు. వట్టిచెరుకూరు మండలం, ఐదోమైలు పాత మద్రాస్ రోడ్డు మీద పెదనందిపాడు వైపు నుంచి వస్తున్న రైతులను బారికేడ్లు పెట్టి పోలీసులు ఆపివేశారు. పోలీసు చర్యలకు నిరసనగా అక్కడే రైతులు, మహిళలు ధర్నా చేయగా వారిని పోలీసులు నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. గుంటూరు నగరంలోనూ కలెక్టర్ బంగ్లా రోడ్డు, నగరంపాలెం రోడ్లలో బారికేడ్లు పెట్టి, పోలీసు నిఘా పెట్టారు. నల్లపాడు స్టేషన్‌లో ఉంచిన నాయకుల్ని మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, వివిధ పార్టీల నాయకులు తూమాటి శివయ్య, మన్నవ హరిప్రసాద్, చుండూరి రంగారావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు.

వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేవలం రూ.300 కోట్లు వెచ్చిస్తే వేలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టును గత, ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. ఉత్తర్వులు అయితే ఇస్తున్నారుగానీ భూసేకరణకు నిధులు ఇవ్వట్లేదన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న నాయకుల్ని బలవతంగా అరెస్ట్ చేయటం అప్రజాస్వామికం అన్నారు. అధికారం ఉందని దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ 1936 నుండి హామీలు తప్ప తమ ప్రాంతానికి తాగు, సాగునీరు లేవన్నారు. నీళ్లిచ్చేదాకా తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులు, నాయకుల్ని అరెస్ట్ చేయటం తగదన్నారు. భారత రాజ్యాంగం పౌరులకు నిరసన తెలియచేసే హక్కు, పోరాడే హక్కును కల్పిస్తే ప్రభుత్వం ఆ హక్కును కాలరాస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నిధులు విడుదల చేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న రైతుల్ని అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నా శివశంకర్, కంచుమాటి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి

(మొదటి పేజీ తరువాయి)

పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సహజ నీటి వనరులకు, గ్రామ, పట్టణ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అలైన్మెంట్ మార్పు చేసి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. వాటిని స్టేక్ హోల్డర్స్ అనుమతితో సిద్ధం చేసి ఆమోదం కోసం ప్రభుత్వాలకు పంపాలని చెప్పారు. సమీక్షలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాతీయ రహదారుల అధికారులు నితీష్, వెంకటేశ్వరరావు, జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు, విద్యుత్ ఎస్‌ఇ శ్రీనివాసరావు, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రాంమోహన్, ఆర్ అండ్ బి ఇఇ రాజానాయక్, ఎన్‌ఎస్‌పి ఎస్‌ఇ వరలక్ష్మి పాల్గొన్నారు.

# జల్‌జీవన్ మిషన్ ద్వారా పేదలకు తాగునీరు

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి - పల్నాడు జిల్లా**

పల్నాడు జిల్లాలో ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ద్వారా జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చేయ్యడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జల జీవన్ మిషన్ పథకం పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా తాగునీరు లేని గ్రామాలు, ప్రభుత్వం నిర్దేశించిన తాగు నీటి ప్రాజెక్టులు, ప్రజలకు అందిస్తున్న పథకాలు, తాగు నీటి సమస్యలు ఉన్న గ్రామాలు, జరుగుతున్న పనులు, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సంభందిత శాఖల అధికారులను అడిగితెలుసుకున్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాని వివరాలను తెలుసుకొని వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సత్వరం పనులు పూర్తి చేసి ప్రజలకు తాగు నీటిని అందించే ప్రక్రియను చేపట్టాలన్నారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు కృష్ణ దేవరాయులు జల జీవన్ మిషన్ పథకం పై ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లుతో సమీక్ష సమావేశంలో పలు తాగునీటి పథకాలపై చర్చించారు. ఎంపీ మాట్లాడుతూ చేసిన పనులకు సంబంధించి పెండింగ్ గుత్తేదారులకు జల జీవన్ మిషన్ బిల్లులు విడుదల అయ్యాయని, మిగిలిన పనులు వేగవంతం చేయాలన్నారు. మంచి నీటి సరఫరా, నాణ్యతలపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వినుకొండ నియోజక వర్గంలో ఎంపి నిధులు, సీ.ఎస్.ఆర్ నిదుల నుంచి మంజూరు చేసిన ఆర్.ఓ ప్లాంట్స్‌ను ఆగస్టు 15 లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ నీటి సరఫర ఇంజనీర్ సురేష్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

## రైల్వే క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

**ప్రజాశక్తి- తెనాలి**

స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్ఫారం చివర రైల్వే క్వార్టర్స్ వద్ద మంగళవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభిమైంది. బాలాజీ రావు పేట విఆర్ఓ ఫిర్యాదు మేరకు పట్టణ 3 టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, వంటిపై దుస్తులు లేవని, స్థానికుల సమాచారం ప్రకారం అతడు యాచకుడని తెలిసిందని పోలీసులు వెల్లడించారు. ఆనవాళ్లు గుర్తించిన వారు త్రీ టౌన్ పోలీసులను సంప్రదించాల్సిందిగా కోరారు.

## ఓటర్ల జాబితా సవరణ పగడ్బందీగా నిర్వహించండి

### వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మీనా

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

ఎన్నికల సంఘం నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 కు సంబంధించి ముందస్తు కార్యక్రమాలు, సవరణ కార్యక్రమాలపై ప్రత్యేక దష్టి పెట్టి సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్-ఎస్ఆర్) 2024 పై జిల్లా కలెక్టర్లు, ఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా

ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్లు జాబితాలో నమోదు, తొలగింపుల దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు, ఏఈఆర్వోలు రికమెండేషన్లు ఆదారంగానే ఈఆర్వోలు పరిష్కరించాలన్నారు. ఓటరు కార్డు ఇంటింటింటి వెరిఫికేషన్ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులతో పాటు, గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి, కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావు తో కలసి పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్ ఎస్ ఆర్ 2024 కు సంబంధించి అన్ని కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఏఈఆర్వోలైన తహశీల్దార్లు మల్లేశ్వరి, ఫణీంద్రబాబు, శ్రీకాంత్, సాంబశివరావు, నగేష్, రత్నం, రాం ప్రసాదు, నాగిరెడ్డి, శిరీష , పద్మనాభుడు, నాసరయ్య, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, బి శ్రీనివాస్, సిటిప్లానర్ కోటయ్య, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

### మిర్చి నిల్వలు

బ్యాగులు

| | | |
|---|---|---|
| మిర్చి దిగుమతి | : | 37,050 |
| మిర్చి ఎగుమతి | : | 34,864 |
| మిర్చి నిల్వ | : | 11,284 |

### మిర్చి ధరలు

రూపాయలలో

| | |
|---|---|
| 334 | 11,500 - 23,000 |
| నెం.5 | 13,000 - 22,000 |
| 273 | 21,300 - 21,300 |
| 341 | 11,500 - 21,000 |
| సూపర్ 10 | 16,500 - 23,500 |
| **నాన్ ఎసి** | |
| తేజ | 10,500 - 24,500 |
| బడిగి | 14,500 - 25,500 |
| దేవనూరు డీలక్స్ | 21,000 - 21,000 |
| తాలుకాయలు | 5,000 -14,500 |
| **ఎసి** | |
| 334 | 12,000 - 19,000 |
| నెం.5 | 21,000 - 21,000 |
| 341 | 14,000 - 21,500 |
| తేజ | 16,000 - 24,700 |
| బడిగి | 14,000 - 24,200 |
| దేవనూరు డీలక్స్ | 18,000 - 18,500 |
| తాలుకాయలు | 7,000 -13,500 |

గుంటూరు కూరగాయల మార్కెట్‌లో అంబటి రాయుడు

## సమర్థవంతంగా వాలంటీర్ల వ్యవస్థ

### ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేస్తుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. గుంటూరులోని తూర్పు నియోజకవర్గంలో మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక వ్యవస్థలో ఒకరిద్దరు తప్పు చేస్తే మొత్తం వ్యవస్థను తప్పుపట్టడం తగదన్నారు. తప్పులు చేసేవారు అన్నిరంగాల్లో ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కరోనా వల్ల రాష్ట్రం రెండేళ్లపాటు అభివృద్ధిలో వెనుకబడిందని ఇప్పుడేక్రమంగా అభివృద్ధిపనులు వేగం పుంజుకున్నాయని అన్నారు. గుంటూరునగరంలో సమస్యలపై తాను అధ్యయనం చేస్తున్నట్లు వివరించారు.లాలాపేట, సంగడిగుంట, కూరగాయల మార్కెట్ ప్రాంతాలను సందర్శించారు. వ్యాపారులతో ముచ్చ టిం చారు.సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైసిపి నాయకులు నూరిఫాతిమా, పలువురు కార్పొరేటర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

## ఉమెన్‌చాందీకి కాంగ్రెస్ పార్టీ నివాళి

**ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి**

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ మృతికి జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమెన్ చాందీ సంతాప సభ నిర్వహిం చారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వర రావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఉమెన్ చాందీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్ వలీ మాట్లాడుతూ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, 12సార్లు ఒకే నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా ఎన్నుకోవటం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఐక్యరాజ్యసమితి వారు ద బెస్ట్ లిడర్ అని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అనే బిరుదు తో సన్మానించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ లో అందరిని ఒక తాటిమీద తీసుకొని వచ్చి ఎక్కడైన రాజకీయ సమస్య ఉంటే దాన్ని సునాయాసంగా పరిష్కరించే వారని మస్తాన్ వలీ గుర్తు చేశారు. మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుక్క చంద్ర పాల్, రాష్ట్ర మేధావుల సంఘం అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు అంబటి రత్తయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సందీప్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలపాటి అనిల్, నగర ఉపాధ్యక్షులు సయ్యద్ జాని గోల్డ్, లీగల్ సెల్ చైర్మన్ సుధీర్ బాబు, జిల్లా కార్యదర్శి బోట్ల బ్రహ్మం,నగర ప్రధాన కార్యదర్శి లు సయ్యద్ సుబాని, మల్లెల మేషె,యన్ యస్ యుఐ అధ్యక్షులు కరీమ్, పశ్చిమ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెహబూబ్, వార్డు ప్రెసిడెంట్ లు వాల్మీకి శ్రీనివాస్,బోడపాటి శ్రీను,కావురి నాగేశ్వరరావు,వసంత కుమార్,ఆళ్ళ దాస్,రఫీ పాల్గొన్నారు

**పాస్‌పోర్ట్ పోయినవి**

గుంటూరుజిల్లా, గుంటూరు వెస్ట్, అమరావతి రోడ్డు, పి.ఎస్.నగర్, 5వ లైనుకు చెందిన నరుకుళ్ళపాటి మురళీకృష్ణ గారి కుమార్తె నరుకుళ్ళపాటి మానసకి చెందిన పాస్‌పోర్టు పోయినది. విజయవాడ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం జారీ చేసిన **W3831577** నెంబర్ గల పాస్‌పోర్టు 15-7-2023 వ తేదీన బ్రాడీపేట 2వ లైన్ నుండి పి.ఎస్.నగర్ 5వ లైనుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియపరచగలరు. స్వయంగా తెచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

**ఇట్లు**
**నరుకుళ్ళపాటి మానస**
**తండ్రి నరుకుళ్ళపాటి మురళీకృష్ణ,**
**పి.ఎస్.నగర్, 5వ లైన్, అమరావతి రోడ్డు,**
**గుంటూరు. పిన్‌కోడ్ : 522002.**
**ఫోన్ : 6302418489**

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR**
**E.P.No:304/2017 in O.S. No: 83/2012**

Between:
Patibandla Samba Siva Rao ….D.H.R
AND
Narala Sreedhar( died) & Others….J.D.R's
**To,**
**J.D.R No-3:** Narala Reshma, D/o.Late Sridhar,
**J.D.R.No-4:**Narala Sai Reddy, S/o.Late Sridhar, Both are R/o.Flat No:A1, Royal Forms, 4th lane Lakshmi Puram, Guntur.

పై నెంబరు ఇ.పి.లో J.D.R No. 3 & 4 అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారం మీరు ది. 25-7-2023న ఉదయం 10-30 గం.లకు పై తెలిపిన కోర్టు నందు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 25-7-2023

**డి.నారాయణమూర్తి,**
**డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్,**
**ఎ.టి. అగ్రహారం, గుంటూరు.**

<u>ప్రకటన</u>
**మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా**
**<u>M.V.O.P. No. 43/2022</u>**

*బిట్వీన్:*
మహంతి మంజూష & Others **-పిటీషనర్స్**
అండ్
విశ్వనాధపల్లి శ్రీనివాసరావు & Others **-రెస్పాండెంట్లు**
*టు: <u>ఆర్-2:</u>*
జి.వేణుబాబు, S/o. ప్రసాదరావు, R/o. 13-32, వింజణంపాడు గ్రామం, వేట్టిచేరుకూరు మండలం, గుంటూరు - 522002.
ఓనర్ ఆఫ్ నెం. AP 07 TH 6855

మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి. నెం. 43/2022 లో పై తెలిపిన 2వ ప్రతివాది అయి వున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తరవు ప్రకారం మీరు **ఆగస్టు నెల 25వ తేదీ 2023వ సం॥రం ఉదయం 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*
***<u>వాయిదా తేది: 25-08-2023</u>***

**నిమ్మల వీర వెంకట సత్యనారాయణ**
సెల్: 9848213165
**నిమ్మల నవీన్**
సెల్: 89781 22722
అడ్వకేట్స్, భీమవరం

**MISSING PASSPORT**

Guntur Dt., Guntur West, Amaravathi Road, PS Nagar 5th Line, Narukulapati Manasa, D/o.Narukulapati Murali, Krishna lost her passport. The Passport Which was issued by Vijayawada Regional Passport Office W3831577 has lost on 15-07-2023, while Coming from brodipet to PS Nagar, They lost the passport. If any body got this Passport. Please contact the details which were given below.

**NARUKULAPATI MANASA,**
**D/o. Narukulapati Murali Krishna,**
**PS Nagar, 5th Line, Amaravathi Road, Guntur- 522002.**

## రూటు మారి కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలం చామర్రు రోడ్డులో గుండా మసీదు రోడ్డు మార్గంలో వెళుతున్న ఇసుక లారీ సైడ్ కాల్వలోకి జారిపోయింది. చామర్రు రీచ్‌లో ఇసుక లోడింగ్ జరుగుతున్నాయి. లోడు లారీలు గ్రామంలోకి రాకుండా ఊరి వెలుపల నుండి వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేశారు. అయినా లారీలు సిసి రోడ్ల మీదగా వెళ్లేందుకు ప్రయత్నించగా మంగళవారం ఈ ఘటన తలెత్తింది. కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపేయాలనే సుప్రీంకోర్టు ఆంక్షలనూ బేఖాతరు చేస్తూ ఇసుక రవాణా కొనసాగడం, అధికారులూ పట్టించుకోపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

స్టాల్ ప్రారంభంలో తహశీల్దార్, మున్సిపల్ చైర్మన్

## రైతు బజారులో రాయితీ కేంద్రం ప్రారంభం

ప్రకాశక్తి - చిలకలూరిపేట

రాయితీపై కందిపప్పు, బియ్యం అందించేందుకు స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని రైతు బజార్లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను తహశీల్దార్ జి.సుజాత మంగళవారం ప్రారంభించారు. కిలో బియ్యం రూ.46, రూ.46 చొప్పున రెండు రకాల బియ్యాన్ని ఒక్కొక్కరికి టిక్కీ చొప్పున అమ్ముతారని చెప్పారు. కందిపప్పు కిలో రూ.135కు ఇస్తారన్నారు. కావాల్సిన వారు గుర్తింపు కార్డులేమీ లేకుండానే తీసుకెళ్లొచ్చని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ టి.రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు, సొసైటీ మాజీ చైర్మన్ టి.బ్రహ్మస్వాములు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె.ఆంజనేయులు, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, శ్రీలక్ష్మి, పార్వతి, మీరాభి, రైతు బజార్ ఎస్టేట్ అధికారి షేక్ ఖాజావలి, మిల్లర్లు పాల్గొన్నారు.

## రైతులకు లైసెన్స్ నంబర్‌తో బిల్లివ్వాలి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

కల్తీ నారు విక్రయించే నర్సరీ యజమానులపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఉద్యాన శాఖాధికారి సిహెచ్ జనని హెచ్చరించారు. మండంలోని వెన్నాదేవి సమీపంలోని మిర్చి నర్సరీలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. నిర్వాహకులు విత్తన చట్టం ప్రకారం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రికార్డులను సరిగా నిర్వహించాలని, నారు కొనుగోలు చేసే రైతులకు లైసెన్స్ నంబర్‌తో బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. షేడ్ నెట్లో పోసిన నారు మిర్చి రంకం, లాట్ నంబర్ జీఓటీ వివరాలు తెలియచేసే బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

మిర్చి నర్సరీలోని నారును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి

# పేటకు నీటి గండం

- ఎండిపోయిన పాత చెరువు
- కొత్త చెరువులోనూ అడుగంటిన నీరు
- ఫిల్టర్ చేయకుండానే సరఫరా
- మరో నాలుగైదు విడతలకు మించి సరఫరా కష్టమే
- సాగర్ నీరు వస్తేనే ఇక్కట్లు తీరేది

పూర్తిగా ఎండిపోయిన పాత చెరువు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో సుమారు రెండు వారాలకుపైగా తాగునీటి పైపులైన్ల ద్వారా సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ జనాభా సుమారు 1,45,550. మున్సిపాలిటీ పరిధిలో నీటి నిల్వ కోసం రెండు చెరువులున్నాయి. అందులో ఒకటి కొత్త చెరువు కాగా ఇది సుమారు 120 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 2,600 ఎం.ఎల్ (మిలియన్ లీటర్లు). రెండోది పాత చెరువు కాగా ఇది సుమారు 75 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని పూర్తి నీటి సామర్థ్యం 950 ఎం.ఎల్.గా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రజలకు పాత చెరువు నుండి నీరు సరఫరా అవుతోంది. ఇందులో 32 ఎం.ఎల్. నీరు మాత్రమే ఉంది. రెండో చెరువులో 17.5 ఎం.ఎల్ నీరు ఉండగా ఆ నీటిని మొదటి చెరువుకు ఇంజన్ల ద్వారా తోడారు. ఆ తర్వాత పెద్ద చెరువులో నీరు తగ్గి పోవడంతో తూములకు నీరు అందక ఫిల్టర్ కాకుండానే నేరుగా పైపులైన్‌కు పంపుతున్నారు. దీంతో, ఫిల్టర్ కాకుండా వచ్చే నీరు మురికిగా, పురుగులతో వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని 17 వార్డులకు ఒక రోజు, మిగిలిన 17 వార్డులకు మరో రోజు చొప్పున నీటిని సరఫరా చేయగా ప్రస్తుతం ఆ పరిస్థితీ లేదు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలు తీసుకోవడానికి జనం మినరల్ వాటర్ ప్లాంట్‌లపై ఆధారపడుతున్నారు.

ఫిల్టర్ పైపులైను కంటే దిగువకు పడిపోయిన కొత్తచెరువులోని నీటి నిల్వ

2017లో కూడా పట్టణంలో తాగునీట ఎద్దడి ఏర్పడింది. నాడు ఓగేరు వాగు నీటిని చెరువులోకి లిఫ్టుల ద్వారా తరలించారు. నేడు ఓగేరు వాగులో కూడా నీరు లేదు. చెరువుకు నీరు నింపాలంటే సాగర్ నుంచి మాత్రమే నీరు నింపాల్సి ఉంది. సాగర్ నుంచి తాగునీటిని విడుదల చేసేందుకు ఇంకా అనుమతులు రాలేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన చెరువులను నింపారు. ఆ నీరు సరిపోలేదు. పెరుగుతున్న అవసరాల రీత్యా నాలుగు నెలలకు ఒకసారైనా చెరువులను నింపాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏడాదికి రెండుసార్లు నకరికల్లు నుంచి కోటప్పకొండ మీదుగా ఎన్ఎస్‌పి కెనాల్స్ ద్వారా రెండు చెరువులకు నీరు వస్తోంది.

పాత లెక్కల ప్రకారం పట్టణ ప్రజలకు రోజుకి 17.5 మిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుందని, ప్రస్తుతానికి 20 మిలియన్ లీటర్ల మేరకు అవసరం ఉన్నట్లు సమాచారం. వెంటనే సాగర్ కెనాల్స్ నుంచి నీరు విడుదల చేసినా చెరువుకు నీరు చేరాలంటే వారం పది రోజులు పడుతుంది. గురువారం నీటి విడుదలకు అవకాశం ఉందని, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు చెబుతున్నారు.

### ప్రజలపై శ్రద్ధ లేకే ఈ దుస్థితి : సిపిఎం

ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజా అవసరాల పట్ల అప్రమత్తత, శ్రద్ధ లేకపోవమే ప్రస్తుత పరిస్థితికి కారణమని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు విమర్శించారు. పట్టణానికి ఎంత నీరు అవసరమో తెలియని స్థితిలో నాయకులు, అధికారులు ఉన్నారని, ఇప్పటికైనా ప్రత్యామ్నాయ చర్యలు సత్వరమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో ప్రజలు తాగు అవసరాలకు ఆధారపడుతున్న వాటర్ ప్లాంట్లలో ధరలు పెంచకుండా చూడాలన్నారు.

## ఏళ్ల తరబడి అర్జీలిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం

### భూముల కోసం రిలే దీక్షలు చేపట్టిన యానాదులు - ప్రజా సంఘాల మద్దతు

దీక్షలకు మద్దతుగా మాట్లాడుతున్న కె.రామారావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బొల్లాపల్లి మండలం కనుమలచెరువు పంచాఅతీలోని గాంధీనగర్ యానాదుల భూముల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ధర్నాచౌక్ వద్ద గాంధీనగర్ సంఘం గ్రామ యానాదుల భూసాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన రిలే దీక్షలకు రామారావు, గోపాలరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. 150 కుటుంబాలకు 1959లో ప్రభుత్వం రెడ్డి యానాది టెనెంట్ కో-ఆపరేటివ్ సొసైటీ (1438) ఏర్పరిచి 450 ఎకరాలను ఉమ్మడిగా ఇచ్చిందని, 10 ఏళ్ల తరవాత 1969 ప్రభుత్వమే ఒంగోలు కెనాల్ కోసం 300 ఎకరాలు తీసుకుందని చెప్పారు. మిగిలిన భూములు రాజకీయ పలుకుబడి కలిగిన సుగాలీలు ఆక్రమించడంతో మొత్తం భూమి కోల్పోయిన యానాదులు ఏడేళ్లగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. దీక్షలకు పిడిఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, సంఘీభావం తెలిపారు. భూముల సాధన కమిటీ నాయకులు బి.సుందర్రావు, సిహెచ్ ఆంజనేయులు, బి.బాల, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

## విద్యా వాలంటీర్లకు అవగాహన

వాలంటీర్లతో ఎంపీ, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా : విద్యా ప్రగతికి ఆసిస్ట్ సంస్థ లాంటి వారి సేవలు అవసరమని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. బొల్లాపల్లి, మాచవరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువు చెప్పేందుకు 32 మంది వాలంటీర్లను ఆసిస్ట్ సంస్థ ద్వారా నియమించగా వారికి కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. వాలంటీర్ల విధులు, పిల్లల్లో తీసుకు రావాల్సిన మార్పులను కలెక్టర్ ఎల్.శివశంకర్ వివరించారు. అసిస్ట్ సంస్థ అందిస్తున్న సహాయ, సహకారాన్ని వినియోగించుకొని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన విద్యా అభివద్ధి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలం పరిధిలోని పలు గ్రామాల్లో టిడిపికి చెందిన కొంతమంది ఓటర్లను తొలగించారని, వాటిని పరిశీలించి వెంటనే దరఖాస్తు చేయించి ఓటు కల్పించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ విజయశ్రీకి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మండలంలో 2023 ఓటర్ జాబితా, ఫోన్ నంబర్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, ఎం.విష్ణు, జానీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## దళారులు లేకుండా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని 16వ వార్డు శ్రీరామపురం సచివాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేరుగా ప్రజలను కలుసుకొని, సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం, సంక్షేమ పథకాలు అందించటంలో మధ్యవర్తులు, దళారులు ప్రమేయం లేకుండాచూడ్డం వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలుగుతోందని చెప్పారు. ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు జరగాలంటే మళ్లీ వైసిపికి పట్టం కట్టాలన్నారు. అనంతరం ధ్రువపత్రాలను అందజేశారు. క్యాక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరులో గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న ముత్యాలరావు

తాడేపల్లి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వర్లు

# 20, 21 తేదీల్లో మున్సిపల్ కార్మికుల రిలేదీక్షలు

**ప్రజాశక్తి-గుంటూరు**

మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయాలని, 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తదితర సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు.మంగళవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాసరావు తోట మున్సిపల్ కార్మికుల మస్టర్ ఆఫీసు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. జులై 20, 21 తేదీల్లో మున్సిపల్ కార్పొరేషన్ వద్ద రిలే దీక్షలు, 27న మున్సిపల్ కార్యాలయ ముట్టడిలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ సాక్షిగా తెలుగుదేశం కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని మోసం చేసిందని, వైసిపి అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందర్నీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు అయినా పర్మినెంట్ చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. గేట్ మీటింగ్‌లో రామకృష్ణ, యం.మణి, భూలక్ష్మి, మల్లి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి :**మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం తాడేపల్లిలోని ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో కె.వెంగమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు జరిగే రిలే నిరాహార దీక్షల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమా వేశంలో జి.కొండయ్య, జి.మరియమ్మ, బాలయ్య, కె.అనూష, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

## 20, 21 తేదీల్లో విఆర్ఏల దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామ రెవెన్యూ సహాయకులు( విఆర్ఎ) సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జులై 20,21 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు జయప్రదం చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, అధ్యక్షులు వి.బాజిబాబు, ప్రధాన కార్యదర్శు షేక్ నాగుల్ మీరా, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సంగయ్య, ఉపాధ్యక్షులు జాలా రాజేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.అదే విధంగా ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద రిలే దీక్షలు, ఆగస్టు 25న ఛలో విజయవాడ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి 2017 మార్చి 24న గ్రామసేవకుల ధర్నాకు వచ్చి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీతం పెంచుతానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన డీఏ కూడా రికవరీ చేయటం దారుణం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అర్హులైన వీఆర్ఏలందరికీ అటెండర్, వాచ్‌మెన్, డ్రైవరు, వీఆర్ఒ పదోన్నతులు ఇవ్వాలన్నారు. తాతల ముత్తాతల కాలం నుంచి పని చేస్తున్న వారిని నామినీలుగా గుర్తించాలని, డిఏ రికవరీని ఆపి తీసుకున్న డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని కోరారు. ఆందోళన కార్యక్రమాల్లో విఆర్ఎలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

## 25న కార్మిక సంఘాల జిల్లా సదస్సు

**ప్రజాశక్తి-గుంటూరు**

అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 25వ తేదీన పాత గుంటూరు, సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకష్ణమూర్తి, సిఐటియు గుంటూరు నగర (పశ్చిమ) ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఐ.ఎఫ్.టి.యు జిల్లా కార్యదర్శి యన్.వి.కష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ అధికారం చేపట్టిన 9 ఏళ్లలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లు తెచ్చారని, వీటితో కార్మికులకు సమ్మె చేసే హక్కు కూడా లేకుండా చేసి, కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. ' మోడీని గద్దె దించండి-దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఆగస్టు 9 క్విట్ ఇండియా డే సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానికేంద్రాలలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహా పడావు నిర్వహిస్తున్నారన్నారు. ఆయా కార్యక్రమాల జయప్రదానికి సన్నాహకంగా 25న జిల్లా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు సంఘాల నాయకుల తీర్మానం

**ప్రజాశక్తి మంగళగిరి**

సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగు సాయాన్ని ప్రభుత్వం అందించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి సిపిఐ కార్యాలయంలో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి వై వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన రైతులు, కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి రైతులు సంఘటితంగా పోరాటాలు చేయాలన్నారు. విద్యుత్ మీటర్లు పెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఉచితంగా రైతులకు విద్యుత్ అందజేయాలని రూ.10వేలు సాగు సాయం ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో వివిధ రైతు సంఘాల నాయకులు జొన్న శివ శంకర్ రావు, కే రాజశేఖర్ రెడ్డి, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, కౌలు రైతు సంఘం నాయకులు పి జమలయ్య, కంచర్ల కాసియ్య, జే జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 7న తిరుపతిలో జాతీయ మహాసభ

**ప్రజాశక్తి-గుంటూరు**

తిరుపతిలో ఆగస్టు 7న నిర్వహిస్తున్న జాతీయ ఓబిసి మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు, జాతీయ బిసి నేతలు పాల్గొంటారన్నారు. అధికారంలోకి రావటానికి బిసిల మద్దతు కోరే రాజకీయ పార్టీలు, గెలిచాక బిసిలను పట్టించుకోవట్లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బిసిలపై కపటప్రేమ ఒలకబోస్తుందన్నారు. మండల్ కమిషన్ నివేదిక పూర్తిగా అమలు చేయాలని, చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్ అమలు చేయాలని, కేంద్రంలో ఓబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బిసి కులగణన చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి మహాసభల్లో సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించటం జరుగుతుందన్నారు. 2021 జనాభా లెక్కల్లో భాగంగా కులగణన చేపడతామని హామీ ఇచ్చిన బిజెపి ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. బిసి ప్రధానిగా ఉన్నా బిసిలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి, దుర్భర జీవితం గడుపుతున్న సంచార, అర్ధసంచార జాతుల సంక్షేమాన్ని పట్టించుకోవట్లేదన్నారు. బిసిల సమస్యలపై బృహత్తర ఉద్యమాన్ని చేపట్టేందుకు కలిసి వచ్చే పార్టీలతో పెద్ద ఎత్తున ఆందోళణలు చేపడతామన్నారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వర్‌రావు, కె.హనుమంతరావు, యం.పూర్ణచంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేసన శంకరరావు, తదితరులు

అసైన్డ్ రైతుల కౌలు జాప్యంపై

## నేడు రాజధాని రైతుల మహాధర్నా

**ప్రజాశక్తి - తుళ్లూరు**

విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద రాజధాని రైతులు బుధవారం మహా ధర్నా నిర్వహించనున్నారు. రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ రైతులకు కౌలు నిలుపుదల, ఎనిమిదేళ్ళ తరువాత భూపత్రాలు సమర్పించాలని షరతులు పెట్టడం, ఎల్ పి ఎస్ (లాండ్ పూలింగ్) లే అవుట్ లను అభివృద్ధి చేయక పోవడం తదితర సమస్యలపై ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా చేపట్టనున్నట్లు అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) సమన్వయ కమిటీ సభ్యులు పువ్వాడ సుధాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాలో రైతులు, రైతు కూలీలు, అసైన్డ్ రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి, సిఆర్‌డిఎ అధికారులకు నిరసన తెలపాలని కోరారు.

## గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి

**ప్రజాశక్తి - ఫిరంగిపురం**

హరిత రాయబారుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, వేమూలూరిపాడులో తొలగించిన వారిని పనిలో కొనసాగించా లని సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వేములూరి పాడులో ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణరావు, ఎస్ఎం వలి మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్‌లకు 5నెలలుగా వేతనాలు బకాయిలున్నాయని తక్షణమే చెల్లించాలన్నారు. కోవిడ్ సమయంలో వాళ్ల ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేస్తే ప్రభుత్వం వారిని సన్మానాలతో, పూలతో సత్కారాలు చేస్తూ ప్రభుత్వం ప్రచారం పొందిందన్నారు. నెలల పర్యంతం జీతాల్లేకుంటే వారి కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని ప్రశ్నించారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను పనిలోకితీసుకోవాలని లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీలత ,మేరీ, మార్తమ్మ , బుజ్జి పాల్గొన్నారు

## తక్కువ ధరకు బిపిటి బియ్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ :**నాణ్యమైన బిపిటి రకాల బియ్యాల్ని అందరికీ అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. స్థానిక రైతు బజార్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తక్కువ ధరల బిపిటి బియ్యం స్టాల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో బిపిటి, బియ్యం ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డు చూపి 20 కేజీల చొప్పున తక్కువ ధరకు బీపీటీ బియ్యాన్ని పొందే వెసలు బాటను కల్పించిందన్నారు. రూ.56లు ఉన్న బిపిటి రకం బియ్యాన్ని రూ. 46లకు, రూ .54 లు ఉన్న బిపిటి రకాన్ని రూ.44లకు రైతు బజార్ లో అందించడం జరుగుతుందని, దీన్ని పొన్నూరు పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ మహబూబ్ మాము, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు .బి వి చౌదరి, రైతు బజార్ ఈవో నాగమణి , పొన్నూరు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఆకుల సాంబశివరావు, కే సత్యనారాయణ, జే హరిబాబు పాల్గొన్నారు.

# ప్రతివ్యవస్థలోనూ చిన్నచిన్న పొరపాట్లు సహజం

- వాలంటీర్ల వ్యవస్థపై బురద చల్లటం దుర్మార్గం : మంత్రి రాంబాబు
- పలుచోట్ల జగనన్న సురక్ష క్యాంప్‌ల నిర్వహణ, ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల, సత్తెనపల్లి రూరల్

వాలంటీర్ల వ్యవస్థపై బురద చల్లటం దుర్మార్గమని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ప్రతి వ్యవస్థలోనూ చిన్నచిన్న పొరపాట్లు ఉంటాయని, వాటిని బూచిగా చూపి వ్యవస్థ మొత్తంపై బురద చల్లటం హేయమన్నారు. ముప్పాళ్ల మండలం మాదల, సత్తెనపల్లి మండలం ఫణిదంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం నేరుగా మీ ఇంటికొచ్చి సమస్యలను పరిష్కరిస్తోందని, అవసరమైన ధ్రువపత్రాలను అందిస్తోందని చెప్పారు. వివిధ ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి నేరుగా మీ చెంతకే తెస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మాదలలో 2784 నివాసాలు ఉండగా 2296 గృహాలను వాలంటీర్లు సందర్శించారని, 1095 అర్జీలు రాగా 682 దరఖాస్తులకు సమస్యల పరిష్కారం, ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని వివరించారు. ఫణిదంలో 1858 కుటుంబాలు ఉండగా 1596 కుటుంబాలను సందర్శించి 500 అర్జీలను స్వీకరించామని, వాటన్నింటినీ పరిష్కరిచామని చెప్పారు. ముప్పాళ్లలో ఎంపిపి ఎం.పద్మ, సర్పంచ్ ఎస్.కోటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ వై.సైదా, ఎంపిటిసి అంజిబాబు, ఎంపిడిఒ పుట్టారెడ్డి, తహశీల్దార్ భవానిశంకర్, వైసిపి మండల కన్వీనర్ నక్క శ్రీనివాసరావు, నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, ఎస్.గోపాలరావు, పుల్లారెడ్డి పాల్గొనగా ఫణిదంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, రూరల్ మండల కన్వీనర్ ఆర్.పురుషోత్తంరావు, సర్పంచ్ వి.బుల్లిబాబు, ఎంపిటిసిలు ఇన్నమ్మ, రాహేలమ్మ, నాయకులు షేక్ ఎలవర్తిపాటి ఈసా, కార్యదర్శి డి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

మాదలలో ధ్రువపత్రాలు అందిస్తున్న మంత్రి రాంబాబు

పెదకూరపాడులో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదరకూరపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి 1127 వినతులు రాగా వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదేశించారు. సర్పంచ్ జి.రాజు, ఎంపిపి బి.మీరయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతిమండల పరిధిలోని ధరణికోట గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల సచివాలయాల కన్వీనర్ బి.హనుమంతరావు, ఎంపిపి ఎం.హనుమంతరావు పాల్గొన్నారు. పథకాలు అందని వారు, ఆధార్, రేషన్ సవరణలు చేయించుకునేవారు, పింఛన్ రానివారు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు పావని రాంబాబు, ఎంపిడిఒ పి.మాధురి, తహశీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిడిఎ శివకుమారి

## కంది సాగుతో లాభాలు : డిడిఎ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కందిని ప్రధాన పంటగా, అంతర్ పంటగా సాగు చేసి లాభాలు పొందొచ్చని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డిడిఎ ఎం.శివకుమారి చెప్పారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడంలో భాగంగా మండలంలోని లింగంగుంట్ల రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి మంగళవారం శిక్షణిచ్చారు. ఎడిఎ మస్తానమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిడిఎ మాట్లాడుతూ గతేడాది కంది పంటకు మంచి ధర లభించిందని గుర్తు చేశారు. ఇతర పంటల్లో అంతర్ పంటగా, పొలం గట్లపైనా కందిని సాగు చేయొచ్చని వివరించారు. కంది పంటలో ఎండుఆకు, వెర్రితెగులు, కాయ ఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రబీలో శనగ వేసే ప్రాంతాల్లో శనగ పంటకు ముందు తక్కువ కాలంలో పంటకు వచ్చే సూర్యనంది, గరుడ లాంటి కొర్ర రకాలను వేసుకోవాలని సూచించారు. ఎడిఎ మాట్లాడుతూ గుర్తింపు కార్డు కోసం కౌలురైతులు దరఖాస్తు చేసుకుంటే కార్డులు జారీ చేస్తామని చెప్పారు. విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ఏవో శ్రీలత, ఎఇఒలు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఆదినారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి - కారెంపూడి

కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, వైద్యుడిగా పల్నాటి ప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి డాక్టర్ ఎం.ఆదినారాయణ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. ఆదినారాయణ 18వ వర్ధంతి సభ మండల కేంద్రమైన కారెంపూడిలో ఆదినారాయణ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్తూపం వద్ద పూలమాలలతో నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, షేక్ హుస్సేన్, కె.రాంబాబు, గని, వైసిపి నాయకులు సిహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ సైదా, ఎం.విజయలక్ష్మి, లెనిన్‌బాబు, నాగమణి, ఝాన్సీ పాల్గొన్నారు.

## ఐదు గురు కానిస్టేబుల్ బదిలీ

ప్రజాశక్తి - రెంటచింతల

స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ శివశంకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వీరంతా ఐదుళ్లుగా ఇక్కడ పని చేస్తున్నారు. బదిలీ అయిన వారిలో పూర్ణ, పవన్ కుమార్, చెన్నయ్య, కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు. వీరు పల్నాడు జిల్లాల్లోనే వివిధ స్టేషన్లకు బదిలీ అయ్యారు.

## ధర పెంచినా సరఫరా నిలిచిన కందిపప్పు

ప్రజాశక్తి - నూజెండ్ల

బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా రేషన్ సరుకుల్లో కందిపప్పు సరఫరా చేయకపోవడం సరికాదని జనసేన అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. మండలంలోని అయినవోలులో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 14,420 రేషన్ కార్డులు ఉండగా జూన్, జూలై నెలల్లో కందిపప్పు ఇవ్వలేదని అన్నారు. గతంలో రూ.45కు కందిపప్పు ఇవ్వగా వైసిపి ప్రభుత్వం రూ.67 చేసిందని, అయినా సరిగా సరఫరా చేయడం లేదని అన్నారు.

## మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా నీటి కటకట

చెరువును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేటలో తాగునీటి సమస్య దారుణమని వివిధ రాజకీయ పార్టీల నాయకులు విమర్శించారు. చుక్క నీరులేని పాత చెరువు, అరకొర నీటితో ఉన్న కొత్తచెరువును నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దల సహకారంతో గత పాలకులు 120 ఎకరాల్లో అతిపెద్ద చెరువును ఏర్పాటు చేయగా దానికి నీటిని నింపలేని దుస్థితిలో నేటి పాలుకులు ఉన్నారన్నారు. కనీసం నీరు ఎప్పుడు విడుదలవుతుంది? ఎప్పుడు సరఫరా చేస్తారు? అనే సమాచారమూ లేకపోవడం సరికాదన్నారు. తాగునీటి చెరువులను సత్వరమే నింపాలన్నారు. రంగు మారిన నీరు, వాసనతో కూడిన నీరు సరఫరా అవుతుంటే ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారని, ఆరోగ్య శాఖ మంత్రి నియోజవకర్గంలో కలుషిత నీటి కారణంగా అనారోగ్య పాలైతే బాధ్యత ఎవరు వహిస్తారని ర్నశ్నించారు. పట్టణ పరిధిలోని బావులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కొత్త మంచినీటి బోర్లు మంజూరు చేయాలని, పాత వాటిని మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ రఫానికి అందించారు. పరిస్థితిని సత్వరం చక్కదిద్దకుంటే అన్ని రాజకీయ పక్షాలూ కలిసి ఉద్యమిస్తాయని హెచ్చరించారు. విసికె పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వి.ముత్తయ్య, వి.సంగీతరావు, ఎం.రాధాకృష్ణ, గోవిందు శంకర శ్రీనివాస్, ఎన్.సుబ్బాయమ్మ, పి.రామారావు, టి.బాబురావు, బి.భగత్‌సింగ్, పి.వెంకటేశ్వర్లు, జె.చిన్నయ్య, కె.వీరయ్య, ఎస్.శ్రీను, ఆర్.సుబ్రహ్మణ్యం, ఎం.భాను ప్రసాద్, ఎం.కోటి, జి.జయరాజు, షేక్ గౌస్, శశికుమార్, బాషా, నస్రుద్దీన్, సునీల్ బాబు, శ్రీహరి, భవాని, వెంకటేష్, ఏడుకొండలు, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

## దొంగ ఓట్లను తొలగించండి

ప్రజాశక్తి - కారెంపూడి

కొంతమందికి రెండుమూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు తెలుస్తోందని, క్షుణ్ణంగా పరిశీలించి వాటిని తొలగించాలని బూత్ లెవల్ అధికారుల (బిఎల్‌ఒ)ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పులిచింతల డిప్యూటీ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి ఆదేశించారు. ఓటరు జాబితాపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కారంపూడి, దుర్గి మండలాల బీఎల్వోలతో ఆయన మంగళవారం సమీక్షించారు. గ్రామాల్లో పర్యటించి 18 ఏళ్లు నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలన్నారు. ఓటర్లంతా తమ ఓటు కార్డునకు ఆధార్‌ను అనుసంధానించారో లేదో పరిశీలించాలని చెప్పారు. సమావేశంలో కారెంపూడి, దుర్గి తహశీల్దార్లు శ్రీనివాస్ యాదవ్, రమేష్, డిటి కీర్తి స్రవంతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

ఓటర నమోదు, సవరణలపై ఈ నెల 21 నుండి వచ్చేనెల 21 వరకు ఇంటింటి సర్వే ఉంటుందని తహశీల్దార్ కె.పుల్లారావు చెప్పారు. ఈ మేరకు బిఎల్వోలతో మంగళశారం ఆయన సమావేశమయ్యారు. 18 ఏళ్లు నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించాలని, ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపుకు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజారావు, ఆర్ఐ కాంతారావు, వీఆర్వోలు రామకృష్ణ, నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని లేమల్లెలోని ప్రకృతి వ్యవసాయం పొలాలను, ఎంపిపి పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న సూర్య మండలం మోడల్ న్యూట్రి గార్డెన్‌ను గ్లోబల్ ఎలియన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ కో-ఆర్డినేటర్ (ఐసిఆర్‌ఎఫ్) అక్షయ్ నంబియార్, జిల్లాకు చెందిన అధికారులు మంగళవారం పరిశీలించారు. అంగన్వాడి సెంటర్ వద్ద న్యూట్రి గార్డెన్‌ను, కోసూరు రమాదేవి మహిళా రైతు పసుపు పంట పొలం వద్ద సరిహద్దు పంటలుగా జొన్న, సజ్జ, మొక్కజొన్న సామూహిక సాగును సందర్శించారు. అనంతరం అత్తలూరులోని అత్తలూరు పాలెం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గానిక్ కంపెనీని సందర్శించారు. కంపెనీ సీఈఓ ఆదినారాయణతో ఎఫ్‌ఒసి గురించి మాట్లాడారు. రైతు రామ్మోహన్ పిఎండిఎస్ నవధాన్యాల పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ గుంటూరు అధికారి భాస్కర్, పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి, సిబ్బంది నందకుమార్, సైదాయ్య, సౌజన్య, సంధ్య పాల్గొన్నారు.

## మహాశక్తి పథకంపై ప్రచారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

టిడిపి మినీ మేనిఫెస్టోలో పేర్కొన్న మహాశక్తి పథకంపై కరపత్రాలను నియోజకవర్గ కేంద్రమైన పెదరకూరపాడులో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కె.శ్రీధర్ భార్య మాధవి లత పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చారు. నాయకులు ముంతాజ్ సుజాత పాల్గొన్నారు.

ప్రజాశక్తి

7

గుంటూరు జిల్లా

బుధవారం 19 జులై 2023

# గ్రామ సింహాలతో గజగజ

**ప్రజాశక్తి-తాడేపల్లి**

తాడేపల్లి పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోజురోజుకు వీటి బెడద పెరిగిపోతుంది. వీటిపై చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచి ఇంటింటికీ పేపరు అందిస్తున్న పేపర్ బాయ్‌ల పరిస్థితి కుక్కల బెడద వల్ల భయాందోళనలో ఉన్నారు. పద్మశాలీ బజార్, బోస్‌బొమ్మ సెంటర్, కెఎల్‌రావు కాలనీ, సీతా నగరం, ముగ్గురోడ్డు ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా వీధికుక్కలు పెద్దగా అరుచుకుంటే వచ్చి పేపర్‌బాయ్‌లపై పడుతున్నాయి. అనుకోని ఈ పరిణామానికి పేపర్ బాయ్‌లు భయంతో వణికిపోతున్నారు. ఒక్కో ప్రాంతంలో వీధి కుక్కల వీర విహారం వల్ల తెల్లారిన తరువాత గంట నుంచి రెండు గంటల పాటు పేపరు ఆలస్యంగా వేయాల్సి వస్తుందని చెబుతున్నారు. కొంతమంది పేపర్ బాయ్‌లో పేపరు కట్టలతో పాటు సైకిల్‌పై ప్రత్యేకంగా ఓ కర్రను కూడా వెంట తీసుకెళ్తున్నారు. కర్రను ఆడించడం వల్ల కుక్కలు దగ్గరకు రావడంలేదని చెబుతున్నారు. ఒక్కోసారి కర్ర తీసుకెళ్లడం మరిచిపోతే ఆ రోజు భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు వీధికుక్కలను ఊరికి దూరంగా తరలించాలని కోరుతున్నారు. పేపర్ బాయ్స్‌పైనే కాకుండా వీధికుక్కల వల్ల సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో రెండు రోజుల క్రితం వేరే ప్రాంతానికి చెందిన కుక్కలు రావడంతో స్థానికంగా ఉన్న కుక్కలు వాటిపై తిరగబడ్డాయి. పెద్దగా అరుస్తూ ప్రజలు భీతిల్లెల్లా ఆ ప్రాంతంలో యుద్ధభూమిని తలపించింది. గతంలో పంచాయతీ, మున్సిపాలిటీ ఉన్న కాలంలో వీధికుక్కలను ఊరికి దూరంగా తరలించేవారు. గత మూడు సంవత్సరాల నుంచి అధికారులు కుక్కలు పట్టుకునే పనికి స్వస్తి పలికారు. అదేమంటే ఒక్కో కుక్కను పట్టుకున్నందుకు వంద రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో 40 రూపాయలకే ఈ పని చేసేవారని అధికారులు చెబుతున్నారు. వాహన దారులు, పాదచారులతో సహా అందరినీ ఇబ్బంది పెడుతున్న వీధికుక్కల బెడదను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నాల్గోతరగతి ఉద్యోగులను నియమించండి

**సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ వినతి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల రద్దీని దృష్టి లో పెట్టుకుని యం యన్ ఒ, ఎఫ్ యం ఒ ల ను (నాల్గో తరగతి )పోస్టులను భర్తీ చేయాలనీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ యం టి కష్ణ బాబును కోరారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కష్ణ బాబు దష్టి కి పలు సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తీసుకుని వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రి కి రోజుకు సగటున 1600 మందికి పైగా ఇన్ పెషెంట్ లు వస్తున్నారని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. 500 మందికి పైగా అత్యవసర కేసు లు నమోదవుతున్నాయన్నారు. ఐ సి యు లో 250 మందికి పైగా రోగులు చికిత్స పొందుతున్నారని, .సిటీ స్కానింగ్, యం ఆర్ ఐ ల కోసం రోగులను తీసుకుని వెళ్లేందుకు నాల్గొ తరగతి ఉద్యోగుల అవసరం ఉందని ఆయన చెప్పారు. ఆసుపత్రి లో 130 మంది మాత్రమే నల్గొ తరగతి ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన చెప్పారు. వీరి కొరత తీర్చడానికి కాంట్రాక్ట్ విధానం, సర్వీస్ ఔట్ సోర్సింగ్ ద్వారా ప్రణాళికలను రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని కష్ణబాబు ఆదేశించారు. ఆగష్టు నెలాఖరు నాటికి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఆసుపత్రి లో ని వివిధ పరికరాల మరమ్మతులను పూర్తి చేయాలనీ ఆయన ఆదేశించారు. సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## 24న రాజధానిలో ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన

**సభ ఏర్పాట్లు పరిశీలించిన అజయ్‌జైన్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు**

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఈ నెల 24వ తేదీ తుళ్ళూరు మండలం, కృష్ణాయపాలెం లోని జగనన్న లే అవుట్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్న దృష్ట్యా మంగళవారం మధ్యానం గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసన మండలి సభ్యులు తలశిల రఘురామ్, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివ ప్రసాద్, జిల్లా ఎస్పి ఆరిఫ్ హఫీజ్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తో కలిసి పరిశీలించారు. జగనన్న లే అవుట్ వద్ద ఏర్పాటు చేస్తున్న పైలాన్, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వెంకటపాలెం వద్ద బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. గుంటూరు మరియు ఎన్‌టిఆర్ జిల్లాలకు సంబంధించిన లబ్దిదారులకు ఇంటి మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంతో పాటు భారీ ఎత్తున ఇళ్ల నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాల్గొంటున్న దృష్ట్యా ఏర్పాట్లన్ని పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ, డ్వామ, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్, మంగళగిరి, తాడేపల్లి తహసీల్దార్లు రామ్ ప్రసాద్, నాగిరెడ్డి, సిపిఓ మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మధుసూదన్ రావు, ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీరు శ్రీనివాసులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముస్లిములపై దాడులను ఖండించండి

**ప్రజాశక్తి - పొన్నూరు రూరల్**

ముస్లిం మైనార్టీల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా పొన్నూరు నియెజిక వర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ లో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చినప్పటి నుండి మైనార్టీ ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం రైలు పట్టాల మీద ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ మోసిన్, పొన్నూరు నియెజిక వర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫైరాజ్ ఖాన్ , పఠాన్ అహ్మద్ ఖాన్, షేక్ జానీ, షేక్ బాజి సాహెబ్, షేక్ సుభాని, షేక్ సీలర్ బాషా , షేక్ గౌస్ బాషా,పఠాన్ వలిపాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాశక్తి -మంగళగిరి**

మంగళగిరి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హను మంతరావు, కార్పొరేషన్ అధికా రులు పరిశీలిం చారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రా వాటర్ పంప్ హౌస్ నిర్మాణాలు పూర్తయితే మంగళగిరి పట్టణానికి రెండు పూటలా నీరు వదలడానికి అవకాశం ఏర్పడు తుందని అన్నారు. అనంతరం స్విమ్మింగ్ పూల్ వద్ద నిర్మాణం జరుగుతున్న గదులను, స్కేటింగ్ రింగ్ పనులను పరిశీలించారు.కార్యక్రమంలో గుంటూరు జిల్లా చేనేత భాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దాలి

**ప్రజాశక్తి-తెనాలి:**

మాట్లాడుతున్న ప్రశాంత్‌రాజ్

పోటీ ప్రపంచంలో విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా రాణించాల్సిన అవసరం ఉందని ముంబైకు చెందిన లీడ్ స్కూల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ కస్టమర్ సక్సెస్ డైరెక్టర్ ప్రశాంత్‌రాజ్ బాసాటి అన్నారు స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం పట్టణానికి చెందిన నెహ్రూనికేతన్, లీడ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో నూతన ఆవిష్కరణలపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రశాంత్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుంచి చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల భవితకు అనుగుణంగా ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. మురళీకాంత్ మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యాబోధనలో అంతా డిజిటల్ యుగమేనన్నారు. విద్యార్థుల మేథస్సుకు, మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నా మన్నారు. సదస్సులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ దాసరి ప్రసంగించారు. ఈ సందర్భంగా లీడ్ స్కూల్ సంస్థ వారి అత్యాధునిక బోధనా పద్దతులను ఎల్‌ఈడి స్కీన్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, రోహిణి, సుధ, మాధవి, సునీల, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం పొందుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ అనిల్ చక్రవర్తి

## పాఠ్య పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి - మంగళగిరి**

వీసం నాగేశ్వరావు, జయప్రద నిర్మల జూనియర్ కళాశాల యాజమాన్యం రూ. 50 వేల విలువ కలిగిన పాఠ్య పుస్తకాలు 25 మంది పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 3150 డిస్ట్రిక్ట్ ట్రైనర్ రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు అనిల్ చక్రవర్తి చేతుల మీదుగా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదని కృషి పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు. ఈ పుస్తక పంపిణీ చేసిన నిర్మల జూనియర్ కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. తదనంతరం అనిల్ చక్రవర్తిని విద్యార్థినీ, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ వీసం వెంకటేశ్వరరావు, నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సి పాల్ వి .వి .ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి .శ్రీనివాస్ , శ్రీ విష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.మనోజ్ కుమార్, నిర్మల జూనియర్ కళాశాల ఇంచార్జ్ కే .జ్యోతి పాల్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం కోల్పోతారు

**యూనివర్శల్ కాలేజీ సభలో ఎస్ఐ మధుపవన్**

**ప్రజాశక్తి -మేడికొండూరు**

మండల పరిధిలోని డోకిపర్రు అడ్డరోడ్డులో గల యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడికొండూరు ఎస్ఐ మధు పవన్ పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల జీవితాలను కోల్పోయే ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, మంచి పౌరులుగా సమాజంలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో యువజన వ్యవహారాల విభాగం లీగల్ ప్రొహిబిషన్ అధికారి వాసంతి, రాధిక, శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపల్ కేశవరెడ్డి, డిప్లమో విభాగ ప్రిన్సిపల్ జయరామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు : సిఐ

**ప్రజాశక్తి- మేడికొండూరు**

మండల కేంద్రమైన మేడికొండూరు, పేరేచర్ల జంక్షన్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని మేడికొండూరు సిఐ వాసు అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరు సెంటర్లో ఆటో యూనియన్ సంఘ సభ్యులకు మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు. ఆటోలు మరియు తోపుడు బండ్లు రహదారి పక్కనే పార్క్ చేయొద్దని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధు పవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లి గీతాంజలి స్కూల్‌లో 22న

## ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

ఉమ్మడి గుంటూరు జిల్లాల రోప్ స్కిప్పింగ్ జిల్లాస్థాయి ఎంపికలు ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూల్లో జరగనున్నట్లు రోప్ స్కిప్పింగ్ ఎంపికల జిల్లా కార్యదర్శి కే శివ మంగళవారం పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ ఎంపికలకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రం తీసుకొని, ఈనెల 22వ తారీకు కుంచనపల్లి లోని గీతాంజలి స్కూల్ వద్దకు రావాలన్నారు. వివరాలకు 9581274742 ఫోన్ నంబర్ సంప్రదించాలని ఆయన తెలిపారు.

## గీతాంజలి స్కూల్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

**ప్రజాశక్తి-గుంటూరు** :స్థానిక రామిరెడ్డి నగర్ ఏటిగ్రహారంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థి దొంతిరెడ్డి సంతోష్‌రెడ్డి శ్రీకాకుళం లో ట్రిపుల్ఐటీ సీటు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ షేక్.హుస్సేన్ తెలిపారు మంగళవారం సంతోష్‌రెడ్డిని డైరెక్టర్ అభినందించారు. తమ పాఠశాల విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీట్ రావడం చాలా గర్వకారణం అని, సంతోష్‌రెడ్డి పదోతరగతి ఫలితాల్లో సైన్స్, మ్యాథ్స్‌లో 100కు 100 మార్కులు సాధించాడని తెలిపారు కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, షేక్ మొహమ్మద్ రఫీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంతోష్‌రెడ్డిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టం తదితరులు

## విజ్ఞాన్ వర్సిటీకి రూ.20 లక్షల సిఎస్ఐఆర్ ప్రాజెక్ట్

**ప్రజాశక్తి-గుంటూరు**

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్ అండ్ ఫార్మాస్యూటికల్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.శ్రీకాంత్‌కి న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.20.14 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'మోనిటరింగ్ అండ్ మ్యాపింగ్ ఆఫ్ మైక్రోప్లాస్టిక్ కంటామినేషన్ ఇన్ చిలికా లేక్ ఎకోసిస్టమ్ ఒడిశా, ఇండియా' అనే అంశంపై పరిశోధనకుగాను రాబోయే 3 సంవత్సరాలకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. ప్రొఫెసర్ శ్రీకాంత్‌ను విజ్ఞాన్స్ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ, నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, విభాగాల అధిపతులు అభినందించారు.

ప్రొఫెసర్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

## పారదర్శకంగా పోలీస్ సిబ్బంది బదిలీలు

పల్నాడు జిల్లా ఎస్‌పి వై.రవిశంకరరెడ్డి

**ప్రజాశక్తి- పల్నాడు జిల్లా**

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో 5 ఏళ్లు పూర్తి చేసుకున్న 16 మంది ఏఎస్ఐలను, 23 మంది హెడ్ కానిస్టేబుల్స్, 63 మంది కానిస్టేబుల్స్‌ను బదిలీ చేశామని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణతో, పారదర్శకతతో, నిష్పక్షపాతంతో మరియు జవాబుదారీతనంతో ఉండేందుకే ఈ బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీలను బట్టి, పోలీస్ సిబ్బంది యొక్క ఆరోగ్య మరియు కుటుంబ సమస్యలను పరిగణనలోకి తీసుకుని సీనియారిటి ఆధారంగా సాధ్యమైనంత వరకు వారు కోరుకున్నచోటే ఈ బదిలీలను చేయడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది కోరుకున్న చోట బదిలీ చేయడం వలన వారి పని సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. ఈ బదిలీల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు మరియు నిబంధనలు ఆధారంగా జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ చట్టాలపై న్యాయసేవాధికార సంస్థ విజ్ఞాన సదస్సు

**ప్రజాశక్తి- గుంటూరు లీగల్**

స్థానిక మహిళా ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు, మహిళా పోలీసులకు వివాహ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ వివాహం చేసుకునే వ్యక్తులు తప్పనిసరిగా అవివాహితులై ఉండాలని, వారి మునుపటి వివాహం నుండి జీవించి ఉన్న జీవిత భాగస్వామిని కలిగి ఉండకూడదు. స్త్రీలకు చట్టబద్ధమైన వివాహ వయస్సు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు అని, వారు వివాహానికి తమ సమ్మతిని స్వేచ్ఛగా ఇవ్వగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా మధ్యవర్తిత్వం గురించి వారికి తెలియచేశారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు పలు వివాహ చట్టాల గురించి అవగాన కలిగించారు. సిడిపిఒ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రమౌళీశ్వరి, వేదికపైన కట్టా కాళిదాసు తదితరులు

పల్నాడు జిల్లాలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎంపి తదితరులు

గుంటూరులో మెగా చెక్కు అందచేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

# జగనన్నతోడును సద్వినియోగం చేసుకోండి

గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు ఎం.వేణుగోపాలరెడ్డి, లోతేటి శివశంకర్

గుంటూరు జిల్లాలో 21,729 మంది, పల్నాడు జిల్లాలో 20,117 మంది లబ్ధిదారులకు మెగా చెక్కులు అందజేత

**ప్రజాశక్తి-గుంటూరు** :చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్మోహన్‌రెడ్డి నాలుగో ఏడాది, మొదటి విడత జగనన్న తోడు పథకం నిధులు జమ చేసే కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 21,729 మంది లబ్దిదారులకు రూ.23.40 కోట్లు రుణాలు మంజూరు, ఇప్పటి వరకు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించిన సభ్యులకు రూ.48.20 లక్షల వడ్డీ రాయితీ మొత్తం రూ.23,88,20,000లు చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర కృష్ణ బలిజ, పూసల కార్పోరేషన్ చైర్ పర్సన్ కోలా భవానీ మణికంఠ, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయరు షేక్ సజీలా, ఎన్ఆర్డీ ఈసీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి పాల్గొన్నారు. డీఆర్డీఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, వెంకటనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -పల్నాడు జిల్లా** : పల్నాడు జిల్లాలో కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్‌వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎంపి శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు లబ్దిదారులకు చెక్కు అంజేశారు. పల్నాడు జిల్లాలో 7వ విడత నిధుల మంజూరులో అర్బన్‌లో 4934 మంది రూరల్‌లో15183 మంది వెరసి 20117 మందికి రూ.20 కోట్ల 11 లక్షల చెక్కు, 18844 మంది లబ్ది దారులకు 30.34 లక్షల రూపాయల వడ్డీ మాఫీ చెక్కులను అందచేసారు. వడ్డీ లేని రుణాల క్రింద చిలకలూరిపేట నియోజక వర్గానికి సంబంధించి 2713 మంది లబ్ది దారులకు రూ. 2.75 కోట్లు, గురజాల నియోజక వర్గానికి సంబందిచి 3116 లబ్ది దారులకు రూ .3.11 కోట్ల, మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి 3058 మందికి రూ 3.05 కోట్ల, నరసరావుపేట నియోజక వర్గానికి సంబంధించి 2602 మందికి రూ. 2.6 కోట్ల పెదకూరపాడు నియోజకవర్గానికి సంబంధించి 2620 మందికి రూ 2.61 కోట్ల, సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించి 2875 మందికి రూ 2.87 కోట్ల వినుకొండ నియోజిక వర్గానికి సంబంధించి 3133 మంది లబ్దిదారులుకు రూ 3.12 కోట్లు మొత్తం 20117 మంది లబ్ది దారులకు 20.11 కోట్లరూపాయలు రుణాలు మంజూరు చేసారు. కార్యక్రమములో డి.ఆర్.డి.ఎ పి.డి. బాలూ నాయక్, నరసరావుపేట, రొంపిచర్ల, నాదెండ్ల మండలాలకు చెందిన పలువురు చిరు వ్యాపార లబ్ది దారులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

### గుంటూరులో కోర్టు మెయిన్ గేటు వద్ద లాయర్ల నిరసన

**ప్రజాశక్తి-గుంటూరు లీగల్**

అవనిగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాది జి.శ్రీనివాసరావుపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని దిగుంటూరు బార్ అసోసియేషన్, ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోర్టు మెయిన్ గేటు వద్ద న్యాయవాదులు మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా గౌరవాధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా గట్టి రక్షణ చట్టాలు తీసుకురావాలన్నారు. ఐలు ఉపాధ్యక్షులు గండికోట శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగాయని, చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయన్నారు. దుండగులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, శిక్షించాలన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించటంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐలు గౌరవాధ్యక్షులు కార్యదర్శి మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు కమలాదేవి, తాహ, ఖాసీం, సంగమేశ్వరరావు, దేవి, సిటీ జనరల్ సెక్రెటరీ ప్రత్యూష పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఐలు నాయకులు, న్యాయవాదులు

# నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ : కమిషనర్

**ప్రజాశక్తి-గుంటూరు**

బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే చేయాలని, నిబంధనలు పాటించని వారికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నవభారత్ నగర్, జేకేసి రోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబందనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధృవపత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్‌కుమార్, టిపిఎస్ గోవర్ధన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్